సాక్షి వరంగల్

శనివారం । 29 । జూలై । 2023



పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రీషెడ్యూల్

కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే తెలంగాణ, పాట్నా ఎక్స్‌ప్రెస్ రైళ్లను రీషెడ్యూల్ చేసి నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. - 8లో▸



5 వరకు లా పరీక్షల ఫీజు గడువు

ఆగస్టు 5వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా లా కోర్సు పరీక్షల ఫీజు చెల్లించవచ్చని కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం $29^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

తెగిన రోడ్లు.. కూలిన ఇళ్లు



దుగ్గొండి: తెగిన తిమ్మంపేట-కమ్మపల్లి రహదారి



చెన్నారావుపేటలో కూలిన హంస శ్రీనివాస్ ఇంటి గోడ

భారీ వర్షాలతో అపారనష్టం

- పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు, కుంటలు
- వరద ఉధృతితో పలు ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసం
- వరంగల్ నగరంలో ముంపునకు గురైన అనేక కాలనీలు
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ ధ్వంసమైన 213 ఇళ్లు
- వందల ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న చేన్లలో నిలిచిన నీరు
- వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటలో దుక్కిటెద్దుల మృతి

సాక్షి, వరంగల్: జిల్లాలో వారం రోజులుగా కురిసిన భారీవర్షాలతో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో వాగులు, చెరువులు, కుంటలు పొంగి పొర్లుతున్నాయి. వరంగల్, నర్సంపేట, వర్ధన్నపేటతో పాటు జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వరద ఉధృతికి ప్రధాన రోడ్లు దెబ్బతిన్నాయి. పలుప్రాంతాల్లోని రహదారులపై గుంతలు ఏర్పడ్డాయి. వరంగల్ నగరంలో వందలాది ఇళ్లు దెబ్బతినగా, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 213 ఇళ్లు ధ్వంసమయ్యాయి. 25 ఇళ్లు వరద ముంపునకు గురయ్యాయి. వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటలో ఎద్దుల జోడి చనిపోయింది. పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న చేన్లలో వర్షపు నీరు ఉన్నా చిన్న మొక్కలు కావడంతో పెద్దగా నష్టం ఉండే అవకాశాలు తక్కువని వ్యవసాయ అధికారులు అంటున్నారు. జిల్లాలో 13,861 ఎకరాల్లో మొక్కజొన్న, 1,30,860 ఎకరాల్లో పత్తి సాగు చేయగా వందల ఎకరాల్లో పంట నష్టం ఉండే అవకాశం ఉంది. 1,35,712 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా.. ఇంకా నాట్లు వేస్తున్నారు. అయితే ఇప్పుడు వర్షం కురవకపోతే పత్తి, మొక్కజొన్నకు పెద్దగా ఇబ్బంది ఉండదని, ఎండ కొడితే అవి మొక్కలు కావడంతో ఎదుగుతాయని అంటున్నారు.



పక్క ఫొటోలో మృతి చెందిన ఎద్దు వద్ద దిగాలుగా కూర్చున్న రైతు దమ్మన్నపేటకు చెందిన నగరబోయిన యాకయ్య. తనకున్న మూడున్నర ఎకరాల్లో రెండు ఎకరాలు వరి నాటుకు సిద్ధం చేసుకున్నాడు. ఎకరంన్నరలో పత్తి పంటతో పాటు ఇతర పంటలు సాగు చేశాడు. పంట క్షేత్రం వద్దనే పశువుల పాక వేసి అక్కడే తన దుక్కిటెద్దులను కట్టేశాడు. బుధవారం రాత్రి ఈదురు గాలుల వర్షానికి పశువులపాక కూలి ఒక ఎద్దు మృతి చెందింది. మరో ఎద్దు గాయాలై శుక్రవారం ఉదయం చనిపోయింది. కేవలం చిన్న సన్నకారు రైతు తన దుక్కిటెద్దులతో వ్యవసాయం చేసుకోవడంతో పాటు నాగలి కూలీకి వెళుతుంటాడు. ఆ డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తుంటాడు. రూ.లక్ష విలువ చేసే దుక్కిటెద్దులు మృతి చెందడం తనకు బాధ కలిగించింది. ఇలా జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలకు ఇళ్లు కూలిపోవడం, జీవాలు మృతి చెందడంతో తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి.

ఎక్కడెక్కడ అంటే..

- వర్ధన్నపేట మండలంలో వారం రోజులుగా కురిసిన వర్షాలకు 18 ఇళ్లు కూలిపోయాయి. దమ్మన్నపేట గ్రామంలో నగరబోయిన యాకయ్యకు చెందిన పశువుల పాక కూలి ఒక దుక్కిటెద్దు మృతి చెందింది. వర్ధన్నపేట పట్టణంలో కోనారెడ్డి చెరువు వరద ప్రవాహం ఎక్కువ ప్రమాద స్థాయికి చేరుకోవడంతో ముందస్తు జాగ్రత్తగా మత్తడి రాళ్లు తొలగించడంతో చెరువు తెగిపోయే ప్రమాదం తప్పింది.
- పర్వతగిరి మండలంలోని పర్వతగిరి, బూరుగుమల్ల, కల్లెడ గ్రామాల్లోని కొన్ని రోడ్లు ధ్వంసమయ్యాయి. కొన్ని గ్రామాల్లో స్వల్పంగా పంట నష్టం వాటిల్లింది. ఇప్పటివరకు 20 ఇళ్లు కూలిపోయాయి. ముంపు గ్రామమైన కల్లెడలో ఆవాస కేంద్రం ఏర్పాటు చేసిన అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు.
- నర్సంపేట-నల్లబెల్లి ప్రధాన రహదారిలో లో లెవల్ కాజ్‌వే వద్ద ఉధృతంగా నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిపేశారు. గురిజాల పెద్ద చెరువు మత్తడి పోస్తుండడంతో నర్సంపేట -గురిజాల ప్రధాన రహదారిలోని లో లెవెల్ కాజ్‌వేలో వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. పత్తి, మొక్కజొన్న పంట చేన్లలో నీరు నిలిచి ఉంది. గ్రామాల్లో దాదాపు 15 ఇళ్ల వరకు కూలిపోయాయి.
- రాయపర్తి మండలంలోని గ్రామాల్లో ఇప్పటివరకు 28 ఇళ్లు కూలిపోయాయి. కొండూరు, జగన్నాథపల్లి, సన్నూరు, బురహాన్‌పల్లి గ్రామాల్లోని చెరువులు ప్రమాద స్థాయికి చేరడంతో తూములు తీసి అధికారులు జాగ్రత్తలు చేపట్టారు. వరదల దాటికి ఊకల్, కొండాపురం గ్రామాల మధ్యన ఉన్న రహదారి కొట్టుకుపోయింది. మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి ఎక్కువ మొత్తంలో నీళ్లు రావడంతో స్పిల్ వే గేట్లు తెరవడంతో రాయపర్తి, రాగన్నగూడెం, పెరిక వేడు, కొండాపురం గ్రామాల్లో ఇప్పుడిప్పుడే వేసిన కొంత మేరకు నాట్లు కొట్టుకుపోయాయి.
- సంగెం మండలంలో 33 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. భారీ వర్షాలకు గవిచర్ల, నల్లబెల్లి, నార్లవాయి చెరువు కట్టలకు ప్రమాదం ఏర్పడగా మరమ్మతులు చేపట్టారు. ఏల్గూర్ రంగంపేట చెరువు ప్రమాద స్థాయికి చేరుకోవడంతో ముందస్తు జాగ్రత్తగా మత్తడి రాళ్లు, కొంతమేర కట్టను తొలగించడంతో చెరువు తెగే ప్రమాదం తప్పింది.
- ఖానాపురం మండలంలో పాకాల కట్టకు కుంగిపోవడంతో ఇరిగేషన్ అధికారులు మరమ్మతు చేశారు. మత్తడి పోస్తుండడంతో కొత్తగూడ, నర్సంపేట రాకపోకలు నిలిచాయి. పాకాల ఆయకట్టు కాల్వలకు భారీగా గండ్లు పడ్డాయి. మండల వ్యాప్తంగా సుమారు 50కి పైగా ఇళ్లు దెబ్బతిన్నాయి.
- చెన్నారావుపేట మండలంలో 45 చెరువులు మత్తడి పోస్తున్నాయి. చెన్నారావుపేట, మగ్దుంపురం, ఎల్లయ్య గూడెం గ్రామాల్లో వాగులు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. 13 ఇళ్ల వరకు నేలకులాయి. కొన్నిచోట్లా భారీ వృక్షాలు రోడ్డుకు అడ్డంగా కూలడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి.
- నల్లబెల్లి మండలంలో బొల్లంపల్లి ఊర చెరువు, గుండ్లపహడ్ బంగారు కుంట చెరువులకు గండి పడింది. దీంతో పత్తి పంటలు నీట మునిగాయి. పలు గ్రామాల్లో 20 ఇళ్లు దెబ్బతిన్నాయి. పలు విద్యుత్ పోల్స్ ధ్వంసం కావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.
- నెక్కొండ మండలంలోని లో లెవెల్ కాజ్ వేలు జలమయం కావడంతో ప్రధాన రహదారులు కోతకు గురయ్యాయి. దీంతో నర్సంపేట, వరంగల్, మహబూబాబాద్, గూడూరు మార్గాల రాకపోకలు స్తంభించాయి. నెక్కొండ వట్టివాగు ఉధృతితో వందల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.
- దుగ్గొండి మండలంలో 14 పెద్ద చెరువులు, 90 కుంటలు మత్తళ్లు పోస్తున్నాయి. వరద నీరు రహదారులపై ప్రవహించడంతో ఆరు మోరీల వాగు వద్ద లక్ష్మీపురం, దుగ్గొండి రోడ్డు కొట్టుకు పోయి గండి పడింది.



గీసుగొండ బొడ్డుచింతలపల్లిలో నీట మునిగిన పత్తి చేనును పరిశీలిస్తున్న ఏఓ హరిప్రసాద్



సంగెం: వెంకటాపూర్‌లో కొట్టుకుపోయిన వెంకటాపూర్-కాట్రపల్లి రోడ్డు



మొగిలిచర్లలో కూలిన విద్యుత్ స్తంభాలు



చెన్నారావుపేట: లింగగిరి గోడ కూలిన కుటుంబాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ భాస్కర్

న్యూస్‌రీల్

రవాణా కష్టాల తొలగింపు



సాక్షి స్పందన

ఖానాపురం: మండలంలోని పర్యాటక ప్రాంతమైన పాకాలకు వెళ్లడానికి పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో సాక్షి దినపత్రికలో శుక్రవారం పర్యాటకుల కష్టాలు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎస్సై తిరుపతి ఆయకట్టు రోడ్డులోని బ్రిడ్జి వద్ద మట్టి పోయించి చదును చేయించారు. అలాగే మండలంలోని నాజీతండాకు వెళ్లే దారిలో కల్వర్టు వద్ద భారీగా కట్టెలు పేరుకుపోయి ఉండడంతో పాటు రోడ్డు కోతకు గురైంది. దీంతో కానిస్టేబుల్ మహేందర్ కట్టెలను తొలగించి రోడ్డు కొట్టుకుపోయిన వద్ద రాళ్లు వేసి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించారు. దీంతో పోలీసుల సేవలను పర్యాటకులతో పాటు రవాణాదారులు అభినందనలు తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పరిశీలన



గీసుకొండ: మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీ మరియపురంలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ (ఎస్ఎస్‌జీ) బృందం సభ్యులు పర్యటించారు. స్టేట్ ఎస్ఎస్‌జీ కోఆర్డినేటర్ వేణు, ఎంపీడీఓ వీరేశం, ఏపీఓ చంద్రకాంత్, టీం సభ్యులు వినీత గ్రామంలో సర్వే నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి వాటిని ఫొటోలతో సహా రికార్డు చేసుకున్నారు. సర్పంచ్ అల్లం బాలిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వప్నలు వారికి అన్ని అంశాలను వివరించారు. ముఖ్యంగా పరిశుభ్రత కోసం చేపడుతున్న పనులు, ఇతర కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

దుగ్గొండి: మండలంలోని తిమ్మంపేట గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం ప్రతినిధి రవీందర్ శుక్రవారం పర్యటించారు. డంపింగ్‌యార్డు, వైకుంఠ దామం, ఇంటింటి మరుగుదొడ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఆయన వెంట ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, కార్యదర్శి శశిధర్, ఫీల్డ్ అసిస్టెంట్ సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి



నర్సంపేట రూరల్: నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే జీతాలు ఇవ్వాలని తెలంగాణ మెడికల్ హెల్త్ అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కిరణ్, సుధాకర్, శ్రీనులు అన్నారు. శుక్రవారం నర్సంపేట జిల్లా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ గోపాల్, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిలకు వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి అవుట్ సోర్సింగ్ విధానంలో ప్రభుత్వ ఆస్పత్రికి సేవలు అందిస్తున్నామని, అవుట్ సోర్సింగ్ విధానంలో దోపిడీకి గురవుతున్నామన్నారు. తక్షణమే ఆ వ్యవస్థను రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా జీతాలు అందించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, శ్రీనివాస్, శంకర్, దీపక్, రమేష్, రాజేష్, శోభ, అనిత, పూజిత, హిమబిందు, నవీన్, జ్యోత్స్న, లింగన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పరుగో పరుగు..



రాయపర్తి: వర్షాలతో గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండి మత్తళ్లు పోస్తున్నాయి. వరద నీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో జనాలు చేపల కోసం పరుగులు పెడుతున్నారు. మండలంలోని పెర్కవేడు, మైలారం, రావులతండా, జేతురాంతండా, పెర్కవేడు, గుబ్బడిబోడుకింది తండా, విద్యానగర్‌తండా తదితర గ్రామాల నుంచి జనాలు మండలకేంద్రానికి చేరుకొని చేపలను పడుతున్నారు. దీంతో ఎక్కడా లేని విధంగా పెద్దమొత్తంలో అక్కడికి చేరడంతో సందడి నెలకొంది. ఒక్కో చేప ఐదు నుంచి పదికిలోల వరకు వలలకు చిక్కుతుండడంతో ఉత్సాహంగా చేపలు పడుతున్నారు.

హమ్మయ్య

- తగ్గిన వర్షంతో ఊపిరిపీల్చుకున్న పట్టణ వాసులు



పునరావాస కేంద్రంలో మాట్లాడుతున్న కలెక్టర్

కరీమాబాద్: భారీ వర్షాలతో అతలాకుతలమైన ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. వరుసగా కురిసిన భారీ వర్షాలతో వరంగల్ నగరంలోని లోతట్టు ప్రాంతాలు నీట మునగగా ప్రధాన రహదారులపై వరద నీరు ప్రవహించి జలాశయాలను తలపించాయి. శుక్రవారం వర్షం లేకపోవడంతో కాలనీలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. భారీ వర్షంతో వరంగల్ నగరంలోని బీఆర్‌నగర్, ఉర్సు కరీమాబాద్, రంగశాయిపేట, శంభునిపేట, గణేష్‌నగర్, సాకరాశికుంట, కాశికుంట, కాశిబుగ్గ, ఏనుమాముల, వరంగల్ చౌరస్తా, బస్‌స్టేషన్, రైల్వే స్టేషన్, వెంకట్రామ థియేటర్, ఓసిటీ, ఎల్‌బీనగర్, గొర్రెకుంట, ధర్మారం, ఖిలా వరంగల్, మామునూరు, జక్కలొద్ది ప్రాంతాల్లో వరద ఉధృతి తీవ్రంగానే ఉండడంతో కాలనీలు జలమయమయ్యాయి. కలెక్టర్ ప్రావీణ్య బీఆర్‌నగర్ తదితర ఏరియాలను సందర్శించి పునరావాస కేంద్రాల్లో వసతులు, వైద్య సౌకర్యం గురించి పర్యవేక్షించారు. ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, ఎమ్మెల్యే నరేందర్‌లు లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు నీరు, భోజనం అందజేశారు.

వాగు ఉధృతితో పంట నష్టం



నెక్కొండ వట్టివాగు ఉధృతితో పంట నీట మునిగింది. వరద ఉధృతి ఏర్పడి ఇసుకమేటలు ఏర్పడుతున్నాయి. ఈ ఏడాది నాలుగెకరాల్లో వరి సాగు చేయగా వాగు ఉధృతితో రూ.90 వేల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

-కుల్ల సుధాకర్, రైతు, నెక్కొండ

భారీ వర్షాలతో ఎన్పీడీసీఎల్‌కు రూ.20కోట్ల నష్టం

- టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ అన్నమనేని గోపాల్‌రావు

బిక్కుబిక్కుమంటూ గడిపాం

మిన్నంటిన రోదనలు - 8లో▸

- మరిన్ని ఫొటోలు 9లో▸



వర్ధన్నపేటలో తెగిన ఆకేరు వాగు చెక్ డ్యాం

పునరావాస కేంద్రాల పరిశీలన



వరద బాధితులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: భారీ వర్షాలకు నర్సంపేట పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ ప్రాంతానికి ప్రమాదం పొంచి ఉండటంతో మాధన్నపేట రోడ్డులోని సిటిజన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ మేరకు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శుక్రవారం పునరావాస కేంద్రాన్ని సందర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రంలో అన్ని రకాల ఏర్పాట్లు చేశామని ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. అనంతరం వరద బాధితులకు భోజనాలు ఏర్పాటు చేసి వారికి స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, కమిషనర్ వెంకటస్వామి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ ఆధ్వర్యంలో..

పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. బాధితులను పరామర్శించి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్, ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి రాజేందర్, కల్వచర్ల రామాంజనేయులు, జిల్లా మహిళా మోర్చా అధికార ప్రతినిధి చిలువేరు రజనిభారతి, పంజాల రాము, గుంటి వీరప్రకాశ్, మల్యాల సాంబమూర్తి, సందీప్, ఠాకూర్ విజయ్‌సింగ్, కందికొండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి


మత్తడి పోస్తున్న పాకాల



మత్తడి పోస్తున్న పాకాల సరస్సు

ఖానాపురం: పాకాల సరస్సు మత్తడి పోస్తోంది. పాకాల పూర్తి స్థాయి నీటి మట్టం 30.3 ఫీట్లు కాగా పూర్తి స్థాయిలో నిండుకుని మత్తడి ప్రవహిస్తుంది. పాకాల సరస్సు విస్తీర్ణం 1,816 హెక్టార్లు ఉంటుంది. పాకాల సరస్సులోకి 3,500 క్యూసెక్కుల నీరు వస్తుండడంతో 4,200 క్యూసెక్కుల నీరు మత్తడి ద్వారా బయటకు వెళ్తుతోంది. మత్తడి పరవళ్లు తొక్కుతుండడంతో పర్యాటకులు తరలి వస్తున్నారు.

నిండుకుండలా మైలారం రిజర్వాయర్




మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

రాయపర్తి: మండలంలోని మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిండుకుండలా మారింది. 0.867 టీఎంసీ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లోకి ఎక్కువగా వరద నీరు చేరడంతో గేట్లు ఎత్తి దిగువప్రాంతాలకు నీరు వదులుతున్నారు. ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తున్నారు.

అనారోగ్య సమస్యలు రాకుండా చూడాలి

- కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: వరద బాధితులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య వైద్యశాఖ అధికారులకు సూచించారు. శుక్రవారం నగరంలోని ముంపు ప్రాంతాలైన గిరిప్రసాద్ కాలనీ, బస్తీ దవాఖాన, బీఆర్‌నగర్, కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాల, సంతోషిమాత గుడి దగ్గరి కాలనీలు, బట్టలబజార్ వెంకటేశ్వర దేవాలయంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు, వైద్యశిబిరాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏమైన అనారోగ్య సమస్యలు వస్తే దగ్గరలోని ఆరోగ్య శిబిరాలకు వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. కాలనీలు, ఇళ్లు, తదితర ప్రాంతాల్లో శానిటేషన్ చేయాలన్నారు. గ్రేటర్ పరిధిలో 15, నెక్కొండ, పర్వతగిరి, వర్ధన్నపేట, దుగ్గొండి, నర్సంపేట మండలాల్లో 5 మొత్తం 20 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయగా వాటిలో 2,789 మంది బాధితులు ఆశ్రయం పొందుతున్నారన్నారు. ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు ప్రజలను కాపాడడం అధికారుల ప్రధాన కర్తవ్యమన్నారు. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో నగరంతో పాటు జిల్లాలో నీట మునిగిన ఇళ్ల నుంచి ప్రజలను అధికార యంత్రాంగం హుటాహుటిన రక్షించిందన్నారు. రాత్రి పగలు తేడా లేకుండా వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించడం జరిగిందన్నారు. ఈ విషయంలో జీడబ్ల్యూఎంసీ అధికారులు, సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీస్ యంత్రాంగం, వివిధ శాఖల సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడె, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ తదితరులున్నారు.



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

జిల్లా పరిస్థితిపై సీఎస్ టెలికాన్ఫరెన్స్

కుండపోత వర్షాల నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని ముంపు ప్రాంతాల ప్రజల సమస్యలు, ఏర్పాట్ల గురించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో నీటి ప్రవాహం తగ్గిందని, వర్షం లేదని, పునరావాస కేంద్రాల్లో బాధితులకు టిఫిన్, భోజనం, వసతి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్‌లు శ్రీవత్స, అశ్విని తానాజీ వాకడె, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ భాషా, డీసీపీ రవీందర్, ఏఓ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేటీపీపీ పంపుహౌస్‌కు చేరిన వరద


కేటీపీపీ పంపుహౌస్ మోటార్ల సమీపానికి చేరిన వరద

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మెట్‌పల్లి వద్ద గోదావరిని ఆనుకొని నిర్మించిన కేటీపీపీ పంపుహౌస్ వద్దకు వరద ఉధృతి చేరింది. శుక్రవారం రాత్రి మోటార్ల వద్దకు చేరుతున్నట్లు తెలిసింది. వరద పెరిగితే మోటార్లు, కంట్రోల్‌రూం ప్యానల్ బోర్డుల వద్దకు వచ్చే అవకాశం ఉందని తెలిసింది. గతేడాది జూలై 14న ఎలక్ట్రిక్ కంట్రోల్ రూం మునిగిన విషయం తెలిసిందే.

కేయూ బాటనీ విభాగం అధిపతిగా లక్ష్మారెడ్డి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని బాటనీ విభాగం అధిపతిగా ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో బాటనీ విభాగంలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.లక్ష్మారెడ్డిని నియమించారు. శుక్రవారం కేయూ వీసీ రమేశ్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య మహ్మద్ ముస్తాఫా పదవీకాలం ముగియటంతో ఆయన స్థానంలో లక్ష్మారెడ్డిని నియమించారు. ఒక టి రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఇద్దరు రెగ్యులర్ అధ్యాపకులు...

కాకతీయ యూనివర్సిటీలో బాటనీ విభాగంలో ఇద్దరు రెగ్యులర్ అధ్యాపకులుగా ప్రొఫెసర్ మహ్మద్ ముస్తాఫా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లలితకుమారి ఉన్నప్పటికీ హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలోని కాంట్రాక్టు లెక్చరర్ లక్ష్మారెడ్డిని క్యాంపస్‌లో బాటనీ విభాగం అధిపతిగా నియమించడం యూనివర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. యూనివర్సిటీలో చరిత్రలో ఓ విభాగం అధిపతి కాంట్రాక్టు లెక్చరర్‌ను నియమించటం ఇది తొలిసారి. ఇప్పటికే క్యాంపస్‌లో విద్యాకళాశాలలో, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో రెగ్యులర్ అధ్యాపకులు లేక పోవటంతో ఆ కళాశాలకు ప్రిన్సిపాల్స్‌గా కాంట్రాక్టులెక్చరర్లకే అప్పగించారు.

మొగుళ్లపల్లి : ముల్కలపల్లి-కొర్కిశాల రోడ్డు


మొగుళ్లపల్లి : రంగాపూర్-ఇస్సిపేట రోడ్డు


గణపురం : నగరంపల్లి వద్ద తెగిన రోడ్డు


దంతాలపల్లి : గండిపడిన సీసీ రోడ్డు


రోడ్లు ధ్వంసం.. ఇసుక మేటలు

నాలుగు రోజులు కురిసిన భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లడమే కాకుండా చెరువులు, కుంటలు మత్తళ్లు పడ్డాయి. కొన్ని చోట్ల గండిపడ్డాయి. శుక్రవారం కాస్త వర్షం తగ్గినా వరదలు మాత్రం ఆగడం లేదు. ప్రధాన రహదారులపై కొన్ని చోట్ల రాకపోకలు స్తంభించిపోయాయి. కాలనీలు, ముంపు ప్రాంతాల్లో వరద నీరు తగ్గకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పంట చేలల్లోకి నీరు చేరడంతో పంటలు నీట మునగడమే కాకుండా పొలాల్లో ఇసుక మేటలు వేశాయి.

- సాక్షి నెట్‌వర్క్


మరిపెడ రూరల్ : పత్తిలో నిలిచిన వర్షపు నీరు


నయీంనగర్ : నయీంనగర్ బ్రిడ్జి వద్ద ధ్వంసమైన రోడ్డు


కమలాపూర్ : శివాలయంలోకి ఉబికి వస్తున్న నీటిలో నంది విగ్రహాలు


పాలకుర్తి : లక్ష్మీనారాయణపురంలో వరిపొలాల్లో ఇసుక మేటలు


చిన్నగూడూరు : వరద ఉధృతికి చెల్లాచెదురుగా పడి ఉన్న కంపోస్ట్ యార్డ్, వైకుంఠధామాలు


ములుగు : రోడ్డు వెంట ప్రవహిస్తున్న వరద


జవహర్ కాలనీలో వరద ముంపునకు గురైన మహ్మద్ ఖాదర్ పాషా గృహం


మల్లూర్ : వల్లెకుంట పొలాల్లో ఇసుక మేటలు


పరకాల: తెగిన పరకాల-భూపాలపల్లి రోడ్డు


వర్ధన్నపేట : కోనారెడ్డి చెరువు కట్ట


బచ్చన్నపేట : బొందుగుల రోడ్డుపై తెగిన కల్వర్టు


మంగపేట : వరద కోతకు గురైన రోడ్డు

భారీ వర్షాలతో ఎన్పీడీసీఎల్‌కు రూ.20 కోట్ల నష్టం

- టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ అన్నమనేని గోపాల్‌రావు
- ముంపు ప్రాంతాల సబ్‌స్టేషన్ల పరిశీలన

హన్మకొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు టీఎస్ ఎన్పీడీసీఎల్‌కు రూ.20 కోట్ల నష్టం జరిగిందని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని వరద తీవ్రతతో ముంపునకు గురైన యాదవనగర్, గోపాల్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్లను సందర్శించారు. అదేవిధంగా కాకతీయ కాలనీలో తెగిపడిన లైనును పరిశీలించి కారణాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ నీట మునిగిన సబ్‌స్టేషన్లతో విద్యుత్ అంతరాయం కలిగిన కాలనీలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు. హనుమకొండ, వరంగల్, ములుగు, భూపాలపల్లి జిల్లాలో అతి భారీవర్షాల వల్ల వేలాది స్తంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, వందలాది కిలోమీటర్ల లైన్లు దెబ్బతిన్నాయని వివరించారు.


యాదవనగర్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ గోపాల్‌రావు

ప్రతి జిల్లాకు ఇద్దరు చొప్పున స్పెషల్ ఆఫీసర్లను, కాంట్రాక్టు ఏజెన్సీలను నియమించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఉద్యోగులు, సిబ్బంది రేయింబవళ్లు కష్టపడి విద్యుత్ సరఫరా అందించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. చాలాచోట్ల విద్యుత్ సరఫరా అందించామని, మిగతా ప్రాంతాల్లో త్వరలో పునరుద్ధరణ పనులు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ, డీఈ జి.సాంబరెడ్డి, ఏడీఈలు దర్శన్‌కుమార్, కిషన్, ఏఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆగస్టు 5 వరకు లా పరీక్షల ఫీజు గడువు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మూడేళ్ల లా కోర్సు రెండో, నాల్గో, ఆరవ సెమిస్టర్ పరీక్షలకు, ఐదేళ్ల లా కోర్సు రెండో, నాల్గవ, ఆరవ, 8వ, 10వ సెమిస్టర్ పరీక్షలకు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంటు) విద్యార్థులు ఆగస్టు 5 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా పరీక్షల ఫీజులు చెల్లించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక ఒక ప్రకటనలో కోరారు. రూ 250 అపరాధ రుసుముతో 8 వరకు గడువు ఉందన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు ఫీజు రూ.1030, మూడేళ్ల ఆరవ సెమిస్టర్, ఐదేళ్ల 10వ సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు రూ.1360, బ్యాక్ లాగ్స్ రెండు పేపర్లకు పైన ఫీజు రూ.930, రెండు పేపర్ల వరకు రూ.400, ఇంప్రూవ్‌మెంటు ప్రతి పేపర్‌కు రూ 300ల చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాల్సింటుందని వారు పేర్కొన్నారు.

వరదలకు కొట్టుకొచ్చిన మృతదేహాలు లభ్యం


వరదనీటిలో శ్రీను మృతదేహం

రామన్నపేట : నగరంలోని రామన్నపేటలో రిక్షా తొక్కుతూ జీవనం సాగించే నరంశెట్టి శ్రీను (40) మృతదేహం వరదల తాకిడికి రామన్నపేట ఎస్సీ కాలనీలో లభ్యమైనట్లు స్థానికులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం కురిసిన భారీవర్షం వరదలకు కాలనీ అంతా జలదిగ్బంధంలో చిక్కుకుంది. శుక్రవారం ఉదయం కాలనీ వాళ్లు నిద్రలేచే సరికి కాలనీలో నీటిలో శ్రీను మృతదేహం కనిపించిందని తెలిపారు. మృతుడి స్వగ్రామం నర్సంపేట మండలం గుండ్రాయిపల్లి గ్రామంగా గుర్తించారు. అత్తగారిల్లు కీర్తినగర్. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారని తెలిపారు. పోలీసులు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గోపాలపురంలో యువకుడు..

హసన్‌పర్తి: వరదల్లో గల్లంతైన టీఎన్జీవోస్ కాలనీ–2కు చెందిన గట్టు రాజు మృతదేహం గోపాలపురం చెరువులో శుక్రవారం లభ్యమైంది. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై విజయ్‌కుమార్ సంఘటన స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. రాజు మృతదేహాన్ని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సందర్శించి కుటుంబాన్ని ఓదార్చారు. ఆయన వెంట బీజేపీ, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తీగల భరత్, ఎఫ్‌సీఐ బోర్డు సభ్యుడు సురేందర్‌గౌడ్, అనిల్ ఉన్నారు. అలాగే గట్టు రాజు మృతదేహాన్ని ఎమ్మెల్యే అరూరి రమేష్ సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబాన్ని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, నాయకులు చింత రమేష్, పెద్ద రాజు, సయ్యద్ ఉమర్ పాషా, తదితరులు ఉన్నారు.

మడికొండ శివారులో..


వెంచర్‌లో లభించిన గుర్తుతెలియని మృతదేహం

మడికొండ: కాజీపేట మండలం మడికొండ శివారులోని ప్రైమ్ సిటీ వెంచర్‌లో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మడికొండ శివారులోని వెంచర్‌లో శుక్రవారం సుమారు (50) సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తుతెలియని మృతదేహాన్ని వెంచర్ సూపర్ వైజర్ తొట్టె తిరుపతి గురువారం వచ్చిన వరదలకు ప్రహరీ కూలిపోగా శుక్రవారం వెంచర్‌ను పర్యవేక్షిస్తుండగా మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వేణు తెలిపారు. మృతదేహంపై ఎలాంటి ఆనవాళ్లు లేవన్నారు. ఎవరైనా ఆచూకీ తెలిస్తే మడికొండ ఇన్‌స్పెక్టర్ 87126 85123, సబ్ ఇన్‌స్పెక్టర్ 87126 85248 నంబర్లలో సమాచారం అందించాలని పేర్కొన్నారు.

తెలంగాణ, పాట్నా ఎక్స్‌ప్రెస్‌ల రీషెడ్యూల్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే హైదరాబాద్-న్యూఢిల్లీ వెళ్లే తెలంగాణ సూపర్‌ఫాస్ట్, సికింద్రాబాద్-దానాపూర్ వెళ్లే పాట్నా ఎక్స్‌ప్రెస్‌ను శుక్రవారం రీషెడ్యూల్ చేసి నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గురువారం వర్షాల కారణంగా కాజీపేట వడ్డేపల్లి రైల్వేట్రాక్ వద్దకు వరదనీరు చేరడంతో పలు రైళ్లను అధికారులు రద్దు చేసి దారి మళ్లించారు. ఈ ఘటనతో తెలంగాణ, పాట్నా ఎక్స్‌ప్రెస్‌లను రీ షెడ్యూల్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కోర్బా–యశ్వంత్‌పూర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్, రక్సోల్-సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను వయా విజయనగరం, విజయవాడ మీదుగా దారి మళ్లించారు. కాజీపేట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ నుంచి రైల్వే టీటీఈలు ప్రయాణికులను రైళ్లలో పంపేలా చేశారు.

ప్లాట్‌ఫాంలో నీరు తొలగింపు

కాజీపేట రైల్వేస్టేషన్‌లో 1వ నంబర్ ప్లాట్‌ఫాం నిండా గురువారం వర్షం నీరు చేరడంతో పలు రైళ్లకు అంతరాయం ఏర్పడింది. దీంతో శుక్రవారం రైల్వే అధికారులు ప్లాట్‌ఫాంలోకి చేరిన నీటిని బయటికి పంపించారు.

చెరువుగా రైల్వే స్టేడియం

కాజీపేట రైల్వే స్టేడియంలోకి వర్షం నీరు పెద్ద ఎత్తున చేరవడంతో చెరువును తలపించింది. ఇటీవల సుమారు రూ.35 లక్షలతో రైల్వే స్టేడియాన్ని అత్యాధునీకరించారు. కానీ వర్షం నీరు బయటికి వెళ్లేందుకు డ్రైయినేజీ సిస్టం లేకపోవడంతో వర్షం పడినప్పుడుల్లా నీరు చేరుతుంది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగాతో నీరు చేరడంతో స్టేడియం అంతా నిండి ఉంటుంది.

మిన్నంటిన రోదనలు


అజహర్ మృతదేహం


మజీద్‌ఖాన్ మృతదేహం


షరీఫ్ మృతదేహం


రషీద్ మృతదేహం


కరీమా మృతదేహం


లాల్‌బీ మృతదేహం


సమ్మక్క మృతదేహం


మహబూబ్‌ఖాన్ మృతదేహం


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో కొండాయి నుంచి మల్యాలకు వెళ్తున్న క్రమంలో కల్వర్టు తెగి 15 మంది వరదలో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఇందులో 8 మంది మృతదేహాలు శుక్రవారం లభ్యమయ్యాయి. దీంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ పాపమంతా కల్వర్టు నిర్మించిన కాంట్రాక్టర్‌దేనని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు పెట్టాలని పరామర్శకు వచ్చిన జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతితో తల్లిదండ్రులను కోల్పోయిన రషీద్, కరీమా కుమారుడు రఫీక్ వాపోయారు. జంపన్నవాగు ఉధృతిగా ఉండడంతో జిల్లా ఎస్పీ గాష్ ఆలం, ఓఎస్డీ అశోక్, ఎమ్మెల్యే సీతక్క, జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రసూనరాణిల చొరవతో పడవల ద్వారా ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో మృతదేహాలను మార్చురీకి తరలించారు.

వడ్డేపల్లి రైల్వే ట్రాక్‌పై గస్తీ

కాజీపేట రూరల్ : కాజీపేట వడ్డేపల్లి రైల్వే ట్రాక్‌పై రైల్వే అధికారులు శుక్రవారం ట్రాక్ గస్తీని పెట్టారు. వర్షాలకు గురువారం వడ్డేపల్లి రైల్వేట్రాక్ వద్దకు వరద నీటి ఉధృతి పెరగడంతో ట్రాక్ కొట్టుకుపోయే ప్రమాదం ఉందని అధికారులు రైళ్లను ఈ ట్రాక్‌మీదుగా రద్దు చేసి రాత్రి 10 గంటల తర్వాత తక్కువ వేగంతో పునరుద్ధరించారు. శుక్రవారం ఇంజనీరింగ్, బ్రిడ్జి విభాగం రైల్వే అధికారులు సిబ్బందిని ట్రాక్‌వద్ద గస్తీ పెట్టారు. వర్షం పడి ట్రాక్‌కు వర్షం నీరు తాకడంతో గస్తీ చేసే వారి సమాచారంతో రైళ్లను ఈ ట్రాక్‌పై నుంచి రద్దు చేసేలా చర్యలు తీసుకున్నారు. వరద ఉధృతికి ట్రాక్ ఏమైనా దెబ్బతిని ఉండవచ్చని రైల్వే ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతు చేసి రైళ్ల స్పీడ్ పెంచేలా చర్యలు తీసుకున్నారు.

బిక్కుబిక్కుమంటూ గడిపాం



మల్యాల, కొండాయి ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు


నీటిలో మంచం మోసుకొస్తున్న బాధితుడు

- 24 గంటలు ప్రాణాలు అరచేతిలోనే
- నీట మునిగిన వందలాది ఇళ్లు

ఏటూరునాగారం : జంపన్నవాగు వరద, పెద్ద చెరువు పోటెత్తడం, జంపన్నవాగు వద్ద నిర్మించిన కరకట్ట తెగిపోవడంతో మండలంలోని కొండాయి, మల్యాల గ్రామాల్లోని ఇళ్లు నీట మునిగాయి. 24 గంటల పాటు వరద నీటిలోనే సుమారు 200 మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని భవనాలు ఎక్కి తలదాచుకున్నారు. మల్యాల ఆశ్రమ పాఠశాలలోకి కూడా వరద రావడంతో భవనం పైనే ఉండిపోయారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఆ రెండు గ్రామాల్లో అనేక మంది ప్రజలు నానా అవస్థలు పడుతూ దేవుడిని వేడుకుంటూ బతికి బయటపడ్డారు. దళిత కాలనీలోని 40 ఇళ్లు నేలమట్టమయ్యాయి. అలాగే దొడ్లలో కూడా ఇళ్లు కూలిపోయాయి. ఇంకా మల్యాల, కొండాయి గ్రామాల్లో శుక్రవారం సైతం వరద నీరు ఉండడంతో ప్రజలు వణికిపోతున్నారు.


బతుకుతామని ఆశ లేదు



పుట్టిననాటి నుంచి ఇప్పటి వరకు ఇంత వరద చూడలేదు. బతుకుతామని అనుకోలేదు. దేవుడి దయతో బతికి బయటపడ్డాం. మా బంధువులు చనిపోయారు. వరదలు తట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది.

- అంకూస్‌బీ, కొండాయి వరద బాధితురాలు

భవనంపైనే ఉన్నా



రాత్రి అంతా భవనంపైనే ఉన్నా. మా ఇళ్లు కొండాయిలో ఉంది. వరద వస్తుందని మల్యాల ఆశ్రమ పాఠశాల భవనం పైకి ఎక్కి కూర్చొని ఉన్నా. నా ప్రాణాలను కాపాడుకున్నా. కానీ మా బంధువులు చనిపోయారు. దేవుడు అన్యాయం చేశాడు. చాలా భయంతో గడిపాం.

- ఎండి సల్మాన్‌ఖాన్, కొండాయి